
సాక్షి
పల్నాడు
మంగళవారం, 25, జూన్, 2024



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం సోమవారం 504.30 అడుగుల వద్ద ఉంది. సాగర్ జలాశయం నుంచి ఎస్ఎల్‌బీసీకి 800 క్యూసెక్కులు విడుదలవుతోంది.



స్టూడెంట్ కిట్స్ పంపిణీ

తెనాలిఅర్బన్: ఐతానగర్ ఆది ఆంధ్ర ఎలిమెంటరీ స్కూల్‌లోని విద్యార్థులకు సోమవారం స్టూడెంట్ కిట్స్‌ను 39వ వార్డు వైఎస్సార్ సీపీ కౌన్సిలర్ గెడ్డేటి ఝాన్సీవాణి పంపిణీ చేశారు.



బాబా సన్నిధిలో ఆర్ఎస్ఎస్ ప్రచారక్

మంగళగిరి: పెదవడ్లపూడి సాయిబాబాను సోమవారం ఆర్ఎస్ఎస్ ఏపీ ప్రచారక్ విజయ్ ఆదిత్య దర్శించుకున్నారు. ఆలయ ధర్మకర్త పాతూరి నాగభూషణం స్వాగతం పలికారు.

వనగూరిన ఆహ్లాదం

- పల్నాడు జిల్లాలో ఐదు ఎకో పార్కులు అభివృద్ధి
- గతేడాది పనులు మొదలుపెట్టిన కోటప్పకొండ, వినుకొండ, పిడుగురాళ్ల, మాచర్ల నగరవనాల పనులు దాదాపు పూర్తి
- ఒక్కో నగరవనం అభివృద్ధికి రూ.2 కోట్లు వ్యయం
- 50 ఎకరాల విస్తీర్ణంలో పార్కులు, ఓపెన్ జిమ్, యోగా, వాకింగ్ ట్రాక్‌లు ఏర్పాటు
- దాతల సహాయంతో పర్యాటకుల సౌకర్యార్థం మౌలిక సదుపాయాల కల్పన

నగర వనం.. నయనానందకరం



కోటప్పకొండలో ఏర్పాటు చేసిన నగరవనం



ఆకట్టుకునే విధంగా స్వాగతద్వారం



కోటప్పకొండ నగరవనంలో చిల్డ్రన్ పార్క్



ఎకో పార్క్

సాక్షి, నరసరావుపేట: ప్రజలకు ఆహ్లాదాన్ని, ఆరోగ్యాన్ని, పచ్చదనాన్ని అందించేందుకు ఏడాది కింద మొదలుపెట్టిన నగర వనాలు ఏర్పాటు దాదాపుగా పూర్తి కావొస్తున్నాయి. దేశంలో నగరాలు, పట్టణాలకు అనుకొని ఉన్న అటవీ భూముల్లో వనాలు పంపకానికి కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన 'నగరయోజన పథకం' కింద ఈ నగర వనాల పనులు జరిగాయి. అటవీ భూముల పరిరక్షణ, ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించాలన్నది వనాల అభివృద్ధి ముఖ్య ఉద్దేశం. అలాగే అడవులు, వన్యప్రాణాల సంరక్షణ గురించి ఈ వనాల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించనున్నారు. అడవుల ప్రాముఖ్యత తెలిపేలా ఈ వనాలలో ప్రత్యేక ఏర్పాట్లు చేయనున్నారు. ప్రతి వనంలో వాకింగ్ ట్రాక్, క్యాంటీన్, ట్రెక్కింగ్ సదుపాయం, ఓపెన్ జిమ్‌తోపాటు వారాంతాల్లో కుటుంబాలు, స్నేహితులతో వచ్చిన వారు సేదదీరేందుకు అనువుగా అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేయనున్నారు.

రూ.2 కోట్లతో నగర వనాలు...

పల్నాడు జిల్లాలో కేంద్రం సహకారంతో అటవీ భూముల్లో నాలుగు నగరవనాలను అభివృద్ధి చేస్తున్నారు. కేంద్రప్రభుత్వ కింద అభివృద్ధి చేస్తున్న నగరవనాలు మున్సిపాలిటీ పరిధికి 10 కిలోమీటర్ల లోపు ఉన్న అటవీ భూములను ఎంచుకుంటారు. మొత్తంగా 50 హెక్టార్ల అటవీ భూమిని ఈ ప్రాజెక్టు కింద తీసుకోగా, అందులో తొలిదశలో 20 హెక్టార్లలో పనులు చేపట్టనున్నారు. దశలవారీగా మిగిలిన 30 హెక్టార్లలో సుందరీకరణ చేపడతారు. ఒక్కో నగర వనానికి హెక్టారుకు రూ.4 లక్షల చొప్పున గరిష్టంగా 50 హెక్టార్లకు రూ.2 కోట్ల దాకా కేంద్ర అటవీశాఖ నిధులు మంజూరు చేయనుంది.

తొలిదశ పనులు పూర్తి..

జిల్లాలో అటవీ భూముల్లో నరసరావుపేట మున్సిపాలిటీ సమీపంలోని కోటప్పకొండ, పిడుగురాళ్ల సమీపంలోని దేవరంపాడు, వినుకొండ సమీపంలోని వెంకుపాలెం, మాచర్ల వద్ద యర్రగొండపాలెం నగరవనాలను ఏర్పాటు చేశారు. వీటిలో తొలి దశ కింద ఇప్పటికే ఒక్కో నగర వనంలో రూ.1.4 కోట్లు ఖర్చు చేశారు. పట్టణ ప్రజలు సేద తీరేందుకు అవసరమైన అన్నివసతులు కల్పించారు. ఇందులో ఓపెన్ జిమ్, యోగాకేంద్రం, సాహసక్రీడలు, క్రీడా ప్రాంగణాలు, సేదదీరడానికి పార్కులు, చెక్కతో చేసిన బల్లలు ఏర్పాటు చేశారు. సందర్శకులు అవసరమైన తాగునీరు, క్యాంటీన్‌లు, వాష్‌రూంలు ఏర్పాటు చేశారు. తొలి దశ పనులు పూర్తికాగానే ఈ పార్కులు ప్రజలకు అందుబాటులోకి రానున్నాయి.

రెండో దశలో రూ.60 లక్షలతో...

నగరవనాలలో రూ.1.4 కోట్లతో తొలిదశ పనులు పూర్తికాగానే కేంద్ర ప్రభుత్వం మరో రూ.60 లక్షలను ఒక్కో వనానికి కేటాయించనుంది. వీటితో మొక్కలు నాటడంతోపాటు మరిన్ని వసతులను కల్పించేందుకు ప్రణాళికలను అటవీశాఖ అధికారులు సిద్ధం చేస్తున్నారు. ఈ నగరవనాలలో దాతల సహకారంతో సైతం అభివృద్ధి పనులు చేపట్టనున్నారు. ముఖ్యంగా అటవీ ప్రాంతానికి అనుకోని ఉన్న ఆధ్యాత్మిక, పర్యాటక ప్రాంతాలలో ఎకో పార్కులను ఏర్పాటు చేయనున్నారు. దీని ద్వారా ఆయా ప్రాంతాలలో పర్యటించే పర్యాటకులకు ఆహ్లాదకర వాతావరణం కల్పించనున్నారు. పర్యాటకులకు అవసరమైన మౌలిక వసతులను కల్పించనున్నారు. మౌలిక వసతుల కల్పనకు దాతల సహకారం తీసుకోనున్నారు. వారి భాగస్వామ్యంతో పనులు చేపట్టనున్నారు. దీని ద్వారా పర్యాటకుల సంఖ్య మరింత పెరగనుంది. పల్నాడు జిల్లాలో దైదా, గుత్తికొండబిలం, మన్నేపల్లి, సంజీవనకొండ, భట్రుపాలెంలలో ఎకో పార్కులను ఏర్పాటు చేయనున్నారు. ఇప్పటికే కొండవీడు కోట సమీపంలో రాష్ట్ర ప్రభుత్వ నిధులతో నగరవనం అభివృద్ధి చేసి ప్రజలకు అందుబాటులోకి తెచ్చారు. ఇది సందర్శకులను ఎంతగానో ఆకట్టుకుంటోంది.

అటవీ ప్రాముఖ్యత తెలిపేలా...




జిల్లాలో నాలుగు నగర వనాల పనులు తుది దశకు చేరుకున్నాయి. ఒక్కో వనంలో రూ.1.4 కోట్ల కేంద్ర ప్రభుత్వ నిధులతో అభివృద్ధి పనులు చేపట్టాం. మరో రూ.60 లక్షలతో రెండోదశ పనులు చేపడతాం. ఒక్కో నగరవనం రూ.2 కోట్లతో సుందరంగా తీర్చిదిద్దనున్నాం. నగరవనాలతో ప్రజలకు ఆహ్లాదం, ఆరోగ్యం అందించడంతో పాటు అడవులు, వన్యప్రాణుల ప్రాముఖ్యతను వివరించనున్నాం. త్వరలోనే ప్రజలకు అందుబాటులోకి తీసుకు వచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

– ఎస్.రామచంద్రరావు, పల్నాడు జిల్లా అటవీశాఖ అధికారి

27న నిధి ఆప్‌కే నికత్

గుంటూరు ఎడ్యుకేషన్: గుంటూరులోని ఉద్యోగుల భవిష్యనిధి (ఈపీఎఫ్) ప్రాంతీయ కార్యాలయం ఆధ్వర్యంలో ఈనెల 27న నిధి ఆప్‌కే నికత్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ప్రాంతీయ పీఎఫ్ కమిషనర్ ఇంద్రనీల్ ఘోష్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. గుంటూరు, కృష్ణా, ఎన్టీఆర్, పల్నాడు, బాపట్ల, ప్రకాశం జిల్లాల్లో ఉదయం 9.30 గంటల నుంచి నిర్వహించనున్నట్లు తెలిపారు. యజమానులు, ఉద్యోగులు, పెన్షనర్లతోపాటు ఇతర వాటాదారులు, లబ్ధిదారులతో పరస్పరం ముఖాముఖిగా చర్చలు జరుగుతాయని తెలిపారు. పీఎఫ్ భాగస్వామ్య యజమానులందరూ కార్యక్రమానికి విధిగా హాజరై, ఫిర్యాదులు ఉంటే వాటిని పరిష్కరించేందుకు వీలుగా ఉద్యోగులతో పాటు అధికారుల దృష్టికి తీసుకురావాలని తెలిపారు. అదే విధంగా నిధి ఆప్‌కే నికత్ కార్యక్రమానికి హాజరుకాగోరు వాటాదారులు, ఇతర శాఖల అధికారులు సూచనలు చేయవచ్చని తెలిపారు. మంగళగిరి–తాడేపల్లి నగరపాలకసంస్థలోని మిషన్ డైరెక్టర్ కార్యాలయం, కృష్ణాజిల్లా ముదినేపల్లి మండలం చేవూరు గ్రామంలోని గ్రోవెల్ ఫీడ్స్ ప్రైవేటు లిమిటెడ్, ప్రకాశం జిల్లా వేటపాలెంలోని వాకా రిసార్ట్స్, విజయవాడలోని పీబీ సిద్ధార్థ డిగ్రీ కళాశాల, బాపట్ల జిల్లా శృంగాపురంలోని జెమ్స్ ఎడ్యుకేషనల్ సొసైటీ, దాచేపల్లి మండలం తంగెడలోని భవ్య సిమెంట్స్‌లో జరిగే నిధి ఆప్‌కే నికత్‌లో యజమానులందరూ పాల్గొని ఫిర్యాదులు, సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు.

నిమ్మకాయల ధరలు



తెనాలి: తెనాలి మార్కెట్‌యార్డులో సోమవారం క్వింటా నిమ్మకాయలు కనిష్ఠ ధర రూ.2800, గరిష్ఠ ధర రూ.4500, మోడల్ ధర రూ.3600 వరకు పలికింది.

న్యూస్‌రీల్

జీఓ 117ను రద్దు చేయాలని మంత్రి నారా లోకేష్‌కు విజ్ఞప్తి



గుంటూరు ఎడ్యుకేషన్: ప్రాథమిక విద్యకు ఆటంకంగా ఉన్న జీఓ నంబర్ 117ను రద్దు చేయాలని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌ను కలిసి విజ్ఞప్తి చేసినట్లు నోబుల్ టీచర్స్ అసోసియేషన్ (ఎన్‌టీఏ) రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎన్. వెంకటరావు, బి. హైమారావు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో తెలుగు మాధ్యమాన్ని సమాంతరంగా ప్రవేశపెట్టాలని కోరుతూ వినతిపత్రం సమర్పించినట్లు వివరించారు.

జాతీయ రగ్బీ పోటీలకు నూతక్కి విద్యార్థి



మంగళగిరి: మంగళగిరి తాడేపల్లి కార్పొరేషన్ పరిధిలోని నూతక్కి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థి షేక్ మహ్మద్ సల్మాన్ జాతీయ రగ్బీ పోటీలకు ఎంపికైనట్లు పీడీ కె.రజనీ నాయక్ సోమవారం తెలిపారు. ఇటీవల బాపట్లలో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొని గుంటూరు జిల్లా జట్టుకు కాంస్య పతకం సాధించినట్లు వెల్లడించారు. ఈనెల 26 నుంచి 28 వరకు పూణే బాలివాడి స్టేడియంలో జరిగే జాతీయ రగ్బీ పోటీలలో పాల్గొననుండా పాఠశాల హెచ్ఎం రాజీవ్‌రత్న, ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు అభినందించినట్లు తెలిపారు.

యార్డుకు 45,769 బస్తాల మిర్చి

కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు సోమవారం 45,769 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 40,696 బస్తాల అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల మిర్చి సగటు ధర రూ.8,000 నుంచి రూ. 17,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.7,500 నుంచి 20,000 వరకు లభించింది. ఏసీ కామన్ రకం మిర్చి రూ. 9,000 నుంచి రూ. 18,000 వరకు లభించింది. ఏసీ ప్రత్యేక రకం రూ. 9,500 నుంచి రూ. 19,700 వరకు ధర పలికింది. తాలు రకం మిర్చికి రూ.4,500 నుంచి రూ.12,000 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 17,563 బస్తాల మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నతశ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వర రెడ్డి తెలిపారు.

28న మెగా జాబ్‌మేళా

గుంటూరు ఎడ్యుకేషన్: జిల్లా ఉపాధి కార్యాలయం, సమర్థనం ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈనెల 28న అమరావతి రోడ్డులోని హిందూ ఫార్మసీ కళాశాలలో మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారి కె.రఘు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. 30 ప్రముఖ సంస్థలు పాల్గొంటున్న జాబ్ మేళాలో 18 నుంచి 35 ఏళ్లలోపు టెన్త్, ఇంటర్, డిగ్రీ, పీజీ విద్యార్హతలు కలిగిన నిరుద్యోగ అభ్యర్థులు రెజ్యూమ్, ఆధార్ జిరాక్స్, విద్యార్హతల ధ్రువపత్రాలతో ఈనెల 28న ఉదయం 9.30 గంటలకు హాజరు కావాలని తెలిపారు. వివరాలకు 63648 67800, 63648 67801, 63648 67802 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

ఉచిత న్యాయ సహాయంపై ఖైదీలకు అవగాహన

నగరంపాలెం(గుంటూరు వెస్ట్): గుంటూరు బ్రాడీపేటలోని జిల్లా కారాగారాన్ని సోమవారం జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి టి.లీలావతి తనిఖీ చేశారు. జాతీయ, రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థల ఆదేశాల మేరకు, కారాగారంలో నెలకొన్న లీగల్ సర్వీసెస్ క్లినిక్‌ను పరిశీలించారు. ఉచిత న్యాయ సహాయంపై ఖైదీలకు వివరించారు. ప్రతి నిందితుడూ న్యాయ సహాయం పొందకుండా ఉండరాదని, ప్రతి ఖైదీకీ ఉచిత న్యాయ సహాయం త్వరగా అందించేందుకు సూచనలు వెల్లడించారు. అనంతరం వంటశాలలను తనిఖీ చేసి, ఖైదీలు భుజించే ఆహారాన్ని చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. వంటశాలలో పాటించాల్సిన జాగ్రత్తలను సిబ్బందికి వివరించారు. భోజన, మౌలిక వసతులపై ఖైదీలతో మాట్లాడగా, వారు సంతృప్తి వ్యక్తం చేశారు. అలాగే మహిళా ఖైదీలకు అందిస్తున్న సదుపాయాలను పరిశీలించారు.

భక్తిశ్రద్ధలతో లక్ష బిల్వార్చన





సామూహిక కుంకుమ పూజలో మహిళలు (ఇన్‌సెట్‌లో) ప్రత్యేక అలంకరణలో గంగా భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి

సత్తెనపల్లి: సకాలంలో సమృద్ధిగా వర్షాలు కురిసి పాడిపంటలతో కళకళలాడాలని లోక కల్యాణార్థం సత్తెనపల్లి మండలం పెదమక్కెన గ్రామంలోని గంగా భ్రమరాంబ మల్లికార్జున స్వామి దేవాలయంలో భక్తిశ్రద్ధలతో లక్ష బిల్వార్చన సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారిని శోభాయమానంగా అలంకరించి సామూహిక కుంకుమ పూజలు, రుద్రాభిషేకం నిర్వహించారు. భక్తులు పెద్దసంఖ్యలో హాజరై స్వామివారి కృపకు పాత్రులయ్యారు. భక్తులకు అన్నసంతర్పణ నిర్వహించారు. భక్తులకు ఎలాంటి ఆటంకం కలగకుండా ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

తాళాలు వేసిన ఇళ్లే లక్ష్యం

- గణపవరంలో రెండు ఇళ్లలో చోరీ
- రూ.10 లక్షల మేర సొత్తు మాయం



చోరీ జరిగిన రఘురామిరెడ్డి ఇంటిని పరిశీలిస్తున్న సీఐ శ్రీనివాసరెడ్డి, ఎస్ఐ బలరామ్‌రెడ్డి

నాదెండ్ల: మేజర్ పంచాయతీ గణపవరం గ్రామంలో రెండు ఇళ్లలో చోరీలు జరిగిన ఉదంతం సోమవారం వెలుగులోకొచ్చింది. తాళాలు వేసిన ఉన్న రెండు ఇళ్లను టార్గెట్ చేసి సుమారు రూ.10 లక్షల విలువైన సొత్తును దొంగలెత్తుకెళ్లారు. గణపవరం గ్రామంలోని మువ్వావారివీధిలో నివాసం ఉండే పాలచర్ల వెంకట రఘురామిరెడ్డి స్థానిక స్పిన్నింగ్ మిల్లులో అకౌంటెంట్‌గా పనిచేస్తుంటాడు. ఈ నెల 19న భార్యాభర్తలు ఇరువురు హైదరాబాద్‌లో తన మనవరాలి పుట్టినరోజు వేడుకలకు వెళ్లారు. ఆదివారం రాత్రి బయలుదేరి సోమవారం తెల్లవారుజామున ఇంటికి చేరారు. ఇంటి ముందు ద్వారానికి వేసిన తాళాలు వేసినట్లే ఉండగా, దుండగులు ఇంటి వెనుక నుంచి ప్రవేశించి గడ్డపారతో తలుపులు, తాళాలు పగలగొట్టినట్లు గుర్తించారు. బీరువాలోని రూ.2.30లక్షల నగదు, 7–10 సవర్ల బంగారు ఆభరణాలు, సుమారు రెండు కిలోల వెండి వస్తువులు చోరీకి గురైనట్లు గుర్తించారు. దీనిపై పోలీసులకు సమాచారమిచ్చారు.

సినిమా హాల్ రోడ్డులోని మరో ఇంట్లో..

గ్రామంలోని సినిమాహాల్ రోడ్డులో నివాసం ఉండే చిలుకూరి రమేష్ (సిద్ధయ్య) స్థానిక స్పిన్నింగ్ మిల్లులో ఉద్యోగం చేస్తుంటాడు. తన కుమారుడు అమెరికా నుంచి రావటంతో అందరూ గుంటూరులో ఉన్నారు. సోమవారం ఉదయం ఇంటికి వచ్చి చూడగా చోరీ జరిగినట్లు గుర్తించాడు. ఇంటి ముందు మెయిన్ గేటు తాళాలు, మెయిన్ డోర్ లాక్‌లు పగలగొట్టి దుండగులు లోనికి ప్రవేశించి చోరీకి పాల్పడ్డారు. బీరువాలో ఉన్న వస్తువులను చిందరవందర చేశారు. ఈ ఇంట్లో ఎలాంటి నగదు, ఆభరణాలు లేకపోవటంతో తాళాలు పగలగొట్టేందుకు తెచ్చుకున్న గడ్డపారను అక్కడే పడవేసి పరారయ్యారు. ఇంట్లోని ఫర్నీచర్‌ను ధ్వంసం చేశారు. దీనిపై పోలీసులకు సమాచారమివ్వగా చిలకలూరిపేట రూరల్ సీఐ కె.శ్రీనివాసరెడ్డి, నాదెండ్ల ఎస్ఐ జె.బలరామ్‌రెడ్డి సిబ్బందితో వచ్చి రెండు గృహాలు సందర్శించారు. వివరాలు నమోదు చేసుకున్నారు. ఉన్నతాధికారులకు సమాచారమివ్వగా, గుంటూరు నుంచి క్లూస్ టీం సభ్యులు చేరుకుని చోరీ జరిగిన రెండు ఇళ్లలో సాక్ష్యాలు సేకరించారు. రెండు సంఘటనలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ జె.బలరామ్‌రెడ్డి తెలిపారు.

ఫిర్యాదులకు సత్వర పరిష్కారం

- జిల్లా కలెక్టర్ శ్రీకేష్ బి.లత్కర్
- కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక
- 50 ఫిర్యాదులు స్వీకరణ



అర్జీదారులతో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ శ్రీకేష్ బి.లత్కర్

నరసరావుపేట: ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా ప్రజా ఫిర్యాదులకు నాణ్యమైన, సత్వర పరిష్కారం చూపించాలని జిల్లా కలెక్టర్ శ్రీకేష్ బి.లత్కర్ జిల్లా అధికారులకు సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లో ప్రారంభమైన ప్రజాసమస్యల పరిష్కార వేదికకు అధ్యక్షత వహించి జిల్లా నలుమూలల నుంచి హాజరైన వారిచే 50 అర్జీలను స్వీకరించారు. డీఆర్ఓ కె.వినాయకంతో పాటు పలువురు జిల్లా అధికారులు పాల్గొన్నారు.

రైతులకు న్యాయం చేయాలి

మా గ్రామం వెంట కృష్ణపట్నం – హైదరాబాద్ బీపీసీఎల్ పైపులైను వెళ్లేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. దీనికోసం గ్రామంలో నాతో కలిపి 20మంది రైతుల వద్ద నుంచి కొంత పొలం తీసుకున్నారు. అందులో నా పొలంలో 51 సెంట్ల భూమి తీసుకున్నారు. సెంటు కేవలం రూ.1250లు మాత్రమే ఇస్తానంటున్నారు. గతంలో మా గ్రామం గుండా హెచ్‌పీసీఎల్ పైపులైనుకు భూమి తీసుకొని సెంటుకు రూ.15వేలు ఇచ్చారు. ఈవిధంగానే ఇస్తామని నమ్మబలికి మాచేత ముందుగానే సంతకాలు చేయించుకున్నారు. ఇప్పుడు కేవలం రూ.1250లు మాత్రమే ఇస్తామంటున్నారు. మాకు తగిన నష్టపరిహారం ఇప్పించి న్యాయం చేయండి.

– సాగి మహేష్ భరత్, కుంకలగుంట, నకరికల్లు మండలం

నష్టపరిహారం అందజేయండి..



నా భర్త నవీన్‌నాయక్ పొలం పనులకు వెళ్లి 2020లో విద్యుత్‌షాక్‌తో మృతి చెందారు. ఇప్పటికీ నష్టపరిహారం అందలేదు. నాకు ఇద్దరు చిన్న పిల్లలు. నష్టపరిహారం ఇప్పించి నా కుటుంబాన్ని ఆదుకోగలరు.

– రమావత్ వాగీభాయి, గుమ్మనంపాడు, బొల్లాపల్లి మండలం

దివ్యాంగురాలికి రూ.10వేలు పింఛన్ ఇవ్వండి



మా కుమార్తె జానకమ్మ పుట్టుకతోనే దివ్యాంగురాలు. ఇప్పుడు మా పాపకు పదేళ్లు. కొంతకాలంగా రూ.3వేలు పింఛన్ ఇస్తున్నారు. లేచిన దవలేని పరిస్థితిలో ఉన్న మా పాపకు రూ.10వేలు పింఛన్ అమలు చేసి ఆదుకోవాలి.

– కూడిపూడి అన్నమ్మ, కట్టమూరు, క్రోసూరు

'రెసిడెన్షియల్' సీట్లు ఇప్పించండి



నేను, నా సోదరి కరాలపాడు స్కూలులో ఏడు, ఎనిమిది తరగతులు పూర్తిచేశాం. ఎనిమిది, తొమ్మిది తరగతులు చదవాల్సివుంది. మా ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా ఇప్పుడు సాంఘిక సంక్షేమ రెసిడెన్షియల్ స్కూలులో చేరాలని అనుకుంటున్నాం. చదువుపై ఎంతో ఆసక్తి ఉంది. జిల్లాలో ఎక్కడైనా సరే చేరేందుకు సిద్ధంగా ఉన్నాం.

– ఇంటూరి నాగచైతన్య, నందు, కరాలపాడు, పిడుగురాళ్ల మండలం

ప్రజా సమస్యలు పరిష్కరించి న్యాయం చేయండి



కలెక్టరేట్ వద్ద అన్నదానం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే చదలవాడ

నరసరావుపేట: ప్రజా సమస్యలను సత్వరమే పరిష్కరించి న్యాయం చేయాలని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు కోరారు. సోమవారం కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ శ్రీకేష్ బి.లత్కర్ అధ్యక్షతన ప్రారంభమైన ప్రజాసమస్యల పరిష్కారం వేదిక కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. కలెక్టర్, జిల్లా అధికారులతో ఆయన మాట్లాడారు. అనంతరం మీడియా సెంటర్‌లో మాట్లాడుతూ తాను ప్రతిపక్ష నాయకుడిగా గత ప్రభుత్వం నిర్వహించిన ప్రతిస్పందన కార్యక్రమానికి హాజరై ప్రజల సమస్యలను జిల్లా అధికారుల దృష్టికి తీసుకురావటం జరిగిందన్నారు.అనంతరం డీఆర్ఓ కె.వినాయకంతో ఆయన చాంబర్‌లో ప్రత్యేకంగా సమావేశమై చర్చించారు. మీకోసం కార్యక్రమానికి వచ్చిన వారందరికీ ఏర్పాటుచేసిన అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. వనమా శ్రీనివాసరావు, బత్తుల మురళి, గంగుల పెద్దిరెడ్డి పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఆలయ ప్రథమ ప్రతిష్ఠోత్సవం



బాపట్ల: మండలంలోని కొండబొట్లవారిపాలెంలో గల శ్రీ వెంకటేశ్వరస్వామి దేవాలయం ప్రథమ ప్రతిష్ఠోత్సవం సోమవారం అత్యంత వైభవంగా జరిగింది. ఆలయ వ్యవస్థాపక ధర్మకర్తలు ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లుతో పాటు కుటుంబ సభ్యులు, కమిటీ సభ్యులు, గ్రామస్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. ఆవరణలోని శ్రీ వెంకటేశ్వరస్వామి దేవాలయంతో పాటు శ్రీ మహాలక్ష్మి, శ్రీ వరసిద్ధి వినాయక, శ్రీ అయ్యప్పస్వామి దేవాలయాల సముదాయాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామికి ఉదయం పంచామృత ఆరాధన, అగ్ని ప్రతిష్ఠాపన, విశేష హోమం జరిపారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు నారాయణం వెంకట కిరణ్ కుమార్, నల్లూరి పాంచజన్య కృష్ణమాచార్యులు, ఆలయ పాలకవర్గం, భక్తులు పాల్గొన్నారు.

వైభవంగా చర్చి ప్రతిష్ట



పిట్టలవానిపాలెం: మండంలోని ఖాజీపాలెం శివారు గడ్డంవారిపాలెంలో నూతనంగా నిర్మించిన చర్చి ప్రతిష్టను సోమవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. దైవ సేవకులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కేంద్ర మాజీ మంత్రి పనబాక లక్ష్మి, బాపట్ల నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ నాయకులు గాదె మధుసూదనరెడ్డి పాల్గొన్నారు. అనంతరం ఇద్దరూ గ్రామ పెద్దలతో సమావేశమయ్యారు. గ్రామస్తుల యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో దేగల రవిరెడ్డి, మారుబోయిన శ్రీనివాసరెడ్డి, మద్దాల డేవిడ్, కుంచల వీరరాఘవరెడ్డి, అలవల అశోక్‌రెడ్డి, కుంచల కిరణ్‌కుమార్‌రెడ్డి, పులి సాయి శ్రీధర్‌రెడ్డి, గాదె గోపిరెడ్డి, గోవతోటి విజయ్ పాల్గొన్నారు.

విద్యార్థుల నమోదుపై శ్రద్ధ అవసరం

చినగంజాం: పాఠశాలలో విద్యార్థులు నమోదుపై శ్రద్ధ తీసుకోవాలని, దీనిపై విద్యాశాఖ సిబ్బంది ప్రత్యేక చొరవ తీసుకోవాలని జిల్లా సీఎంఓ శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఆయన సోమవారం మండల విద్యావనరుల కేంద్రంలో అధికారులు, సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బడిబయట పిల్లల్ని బడిలో చేర్పించేందుకు కృషిచేయాలని సూచించారు. ఎంఈవో బి. అజయ్‌బాబు, ఏఎల్ఎస్ కో–ఆర్డినేటర్ సత్యసాగర్, సీఆర్పీలు పాల్గొన్నారు.

భారీ ఆధిక్యం దిశగా 'విశాఖ'

- ప్రారంభమైన ఏసీఏ అండర్–16 క్రికెట్ పోటీలు
- తొలిమ్యాచ్‌లో 42 పరుగులకే కుప్పకూలిన పశ్చిమ గోదావరి
- తొలిరోజే 349 పరుగుల ఆధిక్యంలో విశాఖ జట్టు
- డబుల్ సెంచరీ సాధించిన భాను శ్రీహర్ష



కె.గౌతమ్ ఆర్య, 6 వికెట్లు



కె.భానుశ్రీహర్ష, 209 పరుగులు



పి.ధీరజ్, 156 పరుగులు

నరసరావుపేట ఈస్ట్: ఒకవైపు వికెట్ల పతనం.. మరోవైపు పరుగుల వరదతో ఏసీఏ అండర్–16 బాలుర క్రికెట్ పోటీలు ప్రారంభమయ్యాయి. ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ (ఏసీఏ) ఆధ్వర్యంలో పెద చెరువులోని ఏసీఏ ఎస్‌కేఆర్‌బీఆర్ క్రికెట్ గ్రౌండ్‌లో సోమవారం అండర్–16 బాలుర అంతర్ జిల్లాల క్రికెట్ పోటీలు ప్రారంభమయ్యాయి. తొలి మ్యాచ్‌లో పశ్చిమ గోదావరి, విశాఖపట్నం జిల్లాల జట్లు తలపడ్డాయి.

42 పరుగులకే కుప్పకూలిన ప.గో.జట్టు..

టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న పశ్చిమ గోదావరి జట్టు పేలవమైన బ్యాటింగ్‌తో తన మొదటి ఇన్నింగ్స్‌లో 42 పరుగులకే కుప్పకూలింది. విశాఖ బౌలర్ల ధాటికి 27.1 ఓవర్లలోనే 10 వికెట్లు సమర్పించుకుంది. పశ్చిమ గోదావరి బాట్స్‌మెన్ సిహెచ్.ఎం.ఎస్.నాగసాకేత్ ఒక్కడే 11 బంతుల్లో 20 పరుగులు సాధించాడు. అందులో మూడు ఫోర్లు ఉన్నాయి. విశాఖ బౌలర్లు కె.గౌతమ్‌ఆర్య 9 ఓవర్లకు 11 పరుగులు ఇచ్చి 6 వికెట్లు పడగొట్టి పశ్చిమ గోదావరి పతనాన్ని శాసించగా, పి.శ్యామ్‌దినేష్ 8 ఓవర్లకు 11 పరుగులు ఇచ్చి 3 వికెట్లు సాధించాడు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన విశాఖ జట్టు తొలిరోజు ఆట ముగిసే సమయానికి తన తొలి ఇన్నింగ్‌లో రెండు వికెట్ల నష్టానికి 391 పరుగుల భారీస్కోర్ సాధించింది. విశాఖ బ్యాట్స్‌మెన్‌లు కె.భాను శ్రీహర్ష 209, పి.ధీరజ్ 156 పరుగులు సాధించారు. విశాఖ జట్టుకు 349 పరుగుల ఆధిక్యత లభించింది. మ్యాచ్‌ను ఏసీఏ అపెక్స్ కౌన్సిల్ సభ్యుడు కె.వి.పురుషోత్తమరావు, గ్రౌండ్ అడ్మినిస్ట్రేటర్ ఎన్.సీతాపతిరావు పర్యవేక్షించారు.

55 క్వింటాళ్ల రేషన్ బియ్యం స్వాధీనం

కొమెరపూడి శ్రీ విఘ్నేశ్వర రైస్ మిల్లులో విజిలెన్స్ తనిఖీలు



స్వాధీనం చేసుకున్న బియ్యంతో గుంటూరు రీజనల్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్పీ కె.ఈశ్వరరావు

సత్తెనపల్లి: రేషన్ బియ్యం అక్రమంగా కొనుగోలు చేసి వాటిని నిల్వ ఉంచి రీసైక్లింగ్ చేసి విక్రయిస్తున్నారనే విశ్వసనీయ సమాచారంతో రాష్ట్ర విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ జనరల్ ఆదేశాల మేరకు విజిలెన్స్ అధికారులు దాడులు చేశారు. గుంటూరు రీజినల్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్పీ కె.ఈశ్వరరావు పర్యవేక్షణలో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు, సత్తెనపల్లి పౌరసరఫరాల డిప్యూటీ తహసీల్దార్ అరుణతో కలసి సత్తెనపల్లి మండలం కొమెరపూడి గ్రామంలోని శ్రీ విఘ్నేశ్వర రైస్ మిల్లులో సోమవారం ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. తనిఖీల్లో ఏ విధమైన రికార్డులు చూపలేదు. మిల్లులోని కానాలలో బియ్యపు రాశులు (ఫోర్టిఫైడ్) ఉన్నట్లు గుర్తించారు. ఆ బియ్యంను గోనె సంచులలోనికి ఎత్తించి కాటా వేయించగా 110 బస్తాలలో బస్తా ఒక్కింటికి 50 కిలోల చొప్పున 55 క్వింటాళ్ల రేషన్ బియ్యం ఉన్నట్లు తేల్చారు. మిల్లులో ధాన్యం కానీ, తవుడు కానీ, నూక కానీ కనిపించలేదు. మిల్లు యాజమాన్యం రేషన్ బియ్యం అక్రమంగా కొనుగోలు చేసి, నిల్వ ఉంచి రీసైక్లింగ్ చేసి అమ్ముతుంటారని విచారణలో తేలినట్లు అధికారులు ప్రకటించారు. మిల్లులోని 110 బస్తాలలోని 55 క్వింటాళ్ల రేషన్ బియ్యం (ఫోర్టిఫైడ్) స్వాధీన పరచుకొని మిల్లు యజమాని గంగాధరరెడ్డిపై '6ఏ' కేసు నమోదు చేయవలసిందిగా సత్తెనపల్లి పౌరసరఫరాల డీటీ అరుణని విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు ఆదేశించారు. తనిఖీలలో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టర్స్ ఎస్.శ్రీనివాసులురెడ్డి, ఎ.శ్రీహరిరావు, సిబ్బంది పాల్గొన్నారు.

శునకం తెచ్చిన తంట

వైద్య విద్యార్థుల ఘర్షణ

గుంటూరు మెడికల్: ఓ శునకం వలన గుంటూరు వైద్య కళాశాల ఎంబీబీఎస్ విద్యార్థుల మధ్య వివాదం ఏర్పడి ఒకరిపై ఒకరు దాడులు చేసుకున్న ఘటన చోటుచేసుకుంది. వివరాలు.. అమరావతి రోడ్డులోని వైద్య కళాశాల మెన్స్ హాస్టల్‌లో ఓ వైద్య విద్యార్థి కుక్కని పెంచుకుంటున్నాడు. అది వైద్య విద్యార్థుల రీడింగ్ రూములో మూత్ర విసర్జన చేస్తుంది. ఈ విషయమై విద్యార్థులు రెండు వర్గాలుగా ఏర్పడి ఒకరిపై ఒకరు దాడులు చేసుకున్నారు. సోమవారం వైద్య విద్యార్థుల ఘర్షణ వ్యవహారంపై కళాశాల అధికారులు సమావేశమై గొడవ పడిన వైద్య విద్యార్థులను హెచ్చరించి పంపించి వేసినట్లు తెలిసింది.

నిర్ణీత గడువులోగా అర్జీలు పరిష్కరించండి

- సిబ్బందిని ఆదేశించిన జిల్లా ఎస్పీ మలికా గార్గ్
- పోలీసు ప్రజాసమస్యల వేదికకు 31 ఫిర్యాదులు



జిల్లా ఎస్పీ మలికా గార్గ్‌కు సమస్య వివరిస్తున్న బాధితుడు

నరసరావుపేట: జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం జిల్లా ఎస్పీ మలికా గార్గ్ అధ్యక్షతన నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదికలో కుటుంబ, ఆర్థిక, ఆస్తి తగాదాలకు సంబంధించిన 31 ఫిర్యాదులను స్వీకరించారు. వచ్చిన ఫిర్యాదులను సత్వరమే నిర్ణీత గడువులోగా పరిష్కరించేవిధంగా చర్యలు తీసుకోవాలని ఎస్పీ ఆదేశించారు.

పోస్కో కేసులో రాజీపడమని వేధింపులు..

నా కుమార్తెపై రెంటచింతల మండలం గోలి గ్రామ పంచాయతీ కార్యదర్శి కె.సుబ్బారావు లైంగికదాడి చేయబోగా అతనిపై ఫిర్యాదు చేయగా, పోలీసులు పోస్కో కేసు పెట్టారు. అప్పటి నుంచి అతను నేను కనిపించిన ప్రతిసారి దుర్భాషలాడుతుండగా తిరిగి మే 15న జిల్లా కలెక్టర్, ఎస్పీలకు ఫిర్యాదుచేశాను. అయినా అతని ప్రవర్తనలో మార్పురాలేదు. కేసులో రాజీపడాలని వేధిస్తూనే ఉన్నాడు. అతనిపై చర్యలు తీసుకోవాలి. – ఓ మహిళ, మాచర్ల

విద్యుదాఘాతంతో వెల్డర్ మృతి



మృతి చెందిన సయ్యద్ మస్తాన్‌వలి

పిడుగురాళ్ల: కరెంట్ షాక్‌కు గురై వెల్డర్ మృతి చెందిన సంఘటన పిడుగురాళ్లలో చోటు చేసుకుంది. మృతుడి బంధువులు తెలిపిన వివరాల ప్రకారం... పిడుగురాళ్ల మండలంలోని కరాలపాడు గ్రామానికి చెందిన సయ్యద్ మస్తాన్‌వలి(35) వెల్డర్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. దీనిలో భాగంగా పిడుగురాళ్ల పట్టణంలోని ఆక్స్‌ఫర్డ్ స్కూల్‌కు ఎదురుగా ఉన్న అమృత లక్ష్మీఫౌండ్రీలో ఐరన్ మెట్లను తయారు చేసేందుకు సోమవారం ఉదయం వెళ్లాడు. మెట్లు నిర్మిస్తూ ఐరన్ రాడ్డును ఒక్కసారిగా తిప్పుతుండటంతో త్రీ ఫేజ్ వైర్‌కు రాడ్డు తగిలి కరెంట్ షాక్‌కు గురయ్యాడు. విషయం తెలుసుకున్న స్నేహితులు మస్తాన్‌వలిని పట్టణంలోని ఓ ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. వైద్యులు పరిశీలించి మస్తాన్‌వలి మృతి చెందినట్లు తెలియజేశారు. మృతుడికి భార్య, ఒక కుమారుడు ఉన్నారు. ఎస్ఐ పఠాన్ రబ్బానీ ఖాన్ సంఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



మృతి చెందిన జొన్నలగడ్డ మీరయ్య

గోళ్లపాడు(ముప్పాళ్ల): గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలోని గోళ్లపాడు గ్రామ సమీపంలోని చప్టా వద్ద సోమవారం తెల్లవారుజామున జరిగింది. సంఘటనకు సంబంధించి స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పెదకూరపాడు నియోజకవర్గం క్రోసూరు మండలం బయ్యవరం గ్రామానికి చెందిన జొన్నలగడ్డ మీరయ్య(51) ఓ పత్రికలో సర్క్యులేషన్ విభాగంలో పనిచేస్తున్నాడు. సోమవారం తెల్లవారుజామున సత్తెనపల్లి నుంచి నరసరావుపేట వైపు వెళుతుండగా గోళ్లపాడు సమీపంలోని చప్టా వద్ద గుర్తుతెలియని వాహనం వేగంగా ఢీకొట్టింది. దీంతో మీరయ్య ఎగిరి దూరంగా పొలాల్లో పడ్డాడు. ద్విచక్రవాహనం ముందు భాగం దెబ్బతినడంతో పాటుగా మీరయ్య కుడికాలు పూర్తిగా విరిగిపోయి, నుదుటిపైన తీవ్ర గాయమై మృతిచెందాడు. తెల్లవారిన తర్వాత పొలాలకు వెళుతున్న వారు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతుని వద్ద ఆధారాలతో కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సత్తెనపల్లి ఏరియా వైద్యశాలకు తరలించారు. మీరయ్య గతంలో వార్త, ఆంధ్రప్రభ పత్రికల్లోనూ సర్క్యులేషన్ విభాగంలో పనిచేశాడు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు. జరిగిన సంఘటనపై కుటుంబసభ్యుల ఫిర్యాదు మేర కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

వ్యాధుల కాలం.. టీకాతో కళ్లెం

- పశువుల్లో సీజనల్ వ్యాధుల భయం
- జాగ్రత్తలు అవసరం



పశువులకు టీకాలు వేస్తున్న పశుసంవర్ధక శాఖ సిబ్బంది

చిలకలూరిపేట: వర్షాకాలం వచ్చేసింది. ఈ సమయంలో పశువుల్లో సీజనల్ వ్యాధులు విజృంభిస్తుంటాయి. ఏ మాత్రం అజాగ్రత్త వహించినా జీవాల్లో ప్రాణనష్టం తప్పదు. ఈ నేపథ్యంలో వ్యాధుల బారిన పడకుండా పశువులు, మేకలు, గొర్రెలకు ముందస్తుగా వ్యాధి నిరోధక టీకాలు వేయించాలని పశు వైద్యులు తెలుపుతున్నారు. పశువర్ధక శాఖ ఆధ్వర్యంలో ఉచిత టీకాలు వేస్తున్నట్లు వెల్లడిస్తున్నారు.

గొంతువాపునకు హెచ్ఎస్ వ్యాక్సిన్..

నల్లజాతి పశువులైన గేదెలు, దున్నల్లో ప్రస్తుత సీజన్‌లో అధికంగా గొంతువాపు వ్యాధి వ్యాపిస్తుంది. వాటి గొంతు కింద భాగం వాపుతో పాటు ఊపిరితిత్తుల్లో నెమ్ము చేరుతుంది. తద్వారా పశువులకు ఊపిరితీసుకోవడం ఇబ్బందిగా మారుతుంది. ఆయాసం, గురకతో పాటుగా తీవ్రమైన జ్వరం, ఆహారం తీసుకోలేక మృత్యువాత పడే అవకాశం ఉంటుంది. ఇలాంటి లక్షణాలు కనిపించిన వెంటనే రక్త పరీక్షల ద్వారా వ్యాధి నిర్ధారించి చికిత్స అందించాలి. గొంతువాపు వ్యాధికి తప్పనిసరిగా హెచ్ఎస్ వ్యాక్సిన్ వేయించాలి.

జబ్బవాపునకు బీక్యూ వ్యాక్సిన్..

తెల్లజాతి పశువులైన ఆవులు, ఎద్దులు, లేగ దూడలకు జబ్బవాపు వ్యాధి వస్తుంది. పశువులకు వెన్ను, తొడ తదితర కండగల శరీర భాగాల్లో నల్లటి వాపు వస్తుంది. దీంతో పశువులకు జ్వరం రావడం, మేత మేయకపోవడం, కదలలేకపోవడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. ఈ లక్షణాలు కనిపించిన వెంటనే చికిత్స అందించాలి. బీక్యూ వ్యాక్సినేషన్ వేయించాలి.

చిటుకు వ్యాధికి ఈటీ వ్యాక్సిన్..

తొలకరి వర్షాలకు మొలకెత్తిన లేతగడ్డిని గొర్రెలు, మేకలు మేసినప్పుడు గడ్డిలో ఉండే బ్యాక్టీరియా క్రిములు శరీరంలోకి వెళ్లడం ద్వారా చిటుకువ్యాధి వ్యాపిస్తుంది. ఈ వ్యాధి సోకిన వెంటనే చికిత్స అందించాలి. లేదంటే ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉంది. ఈటీ వ్యాక్సిన్ తప్పనిసరిగా వేయించాలి.

టీకాలతో వ్యాధులు దూరం



వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో తెల్ల, నల్లజాతి పశువులతో పాటు గొర్రెలు, మేకల్లో అత్యధికంగా వ్యాధులు వ్యాపించే అవకాశం ఉంది. ముందు జాగ్రత్తగా పశువులకు టీకాలు వేయించటంతో వ్యాధులు ప్రబలేందుకు అవకాశం ఉండదు. గ్రామాల్లో పశువులకు వ్యాధులు సోకితే సమాచారం అందించాలి. వెంటనే పశు వైద్యులను సంప్రదించాలి. వర్షాకాలం కావడంతో సిబ్బందిని అప్రమత్తం చేసి టీకాలు వేయిస్తున్నాం.

– డాక్టర్ టి.శ్రీనివాసరావు, అసిస్టెంట్ డైరెక్టర్, పురుషోత్తమపట్నం పశువైద్యశాల